# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER 2006**

సంవత్సర చందా రూ. 50/-

సత్యవాణి ఇప్పుడు 'విస్సా' ఛానెల్ లో కూడ
ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥
నుండి 7:30 గం॥ల వరకు చూడండి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6.30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్సా' ఛానల్ లో ఉదయం 7:00గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00 గం॥లకు, సాయంత్రం 5:30గం॥లకు
(కాకినాడ లో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్ జాషువా గూటం
బ్రదర్ రిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధువులకు విన్పించండి !!

# సత్యవాక్యము

**THE WORD OF TRUTH**

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | సెప్టెంబర్ 2006 | సంచిక 2


## విజ్ఞాన శాస్త్రము - బైబిలు - 1
*(The Bible and Sciencd)*

ఆధునిక విజ్ఞానశాస్త్ర సంగతులు బైబిలుతో సమైక్యతను కలిగియున్నవా? యను ప్రశ్నను సంచికలో ఎత్తి యుంటిమి నిజానికి బైబిలు విజ్ఞాన శాస్త్రపు అచ్చు పుస్తకము కాదు. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యము నకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించు టకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమో 3:16, 17). గనుక మానవు లకు సత్ప్రవర్తనను గరవుటయే బైబిలు యొక్క ముఖ్యోద్దేశముగాని, విజ్ఞాన శాస్త్రమును తరుచుట కాదు.

అయితే బైబిలు గ్రంథము ప్రపంచ మందున్న సమస్త సంగతులను తరచుచున్నది. గంభీర విజ్ఞానిచే నిర్మించ

బడిన విశ్వములో మనము ఉనికిని కలిగియున్నాము గనుక బైబిలులో కూడ వైజ్ఞానిక శాస్త్ర సంగతులు లేకపోలేదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రముతో బైబిలు ఐక్యత జెందుటలేదు అని కొందరు బైబిలు వ్యతిరేకులు, విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానము లేనివారు చెప్పుచుందురు. విజ్ఞానశాస్త్రముతో బైబిలు ఐక్యత కలిగి యున్నదో లేదో తెలిసికొనకముందు విజ్ఞానశాస్త్రము (Science) అనగా ఏమిటో ముందు మనము ఎరుగవలెను. నిరూపించ దగునట్టి పరిపూర్ణ విజ్ఞానమే 'విజ్ఞానశాస్త్రము' అని క్లుప్తముగ మనము చెప్పుకొనవచ్చును. అయితే విజ్ఞాన శాస్త్రపు పేరున అనేక సిద్ధాంత ములను (Scientific Theories) శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టవచ్చును. అవి పరిపూర్ణములని నిరూపింపబడు వరకు అవి సిద్ధాంతములు (లేక శాస్త్రవేత్తల ఊహలు) గానే పరిగణింపబడును గాని విజ్ఞానశాస్త్రముగా పరిగణింపబడవు. అట్టి సిద్ధాంతములలో నిరూపింపబడ కుండా అనేక చిల్లులతో నేటి వరకును నిండి యున్నది పరిణామ సిద్ధాంత మొకటి. అందువలన మానవులు ప్రవేశపెట్టిన సిద్ధాంతములతో గాక, పరిపూర్ణ విజ్ఞానమని నిరూపింపబడిన విజ్ఞాన శాస్త్రముతో బైబిలు ఐక్యత జెందియున్నది. బైబిలు లేఖకులు దేవుని ఆత్మ ప్రేరేపణచే వ్రాసిరి గనుక ఆనాటి మానవజ్ఞానమున కందని గంభీర వైజ్ఞానిక శాస్త్ర పలుకులనేకములను వారు బైబిలునందు లిఖించిరి. అట్టి వానిలో కొన్నింటిని యిప్పుడు మనము పరిశీలింతము.

18వ శతాబ్దపు అంతమందు హెర్బర్ట్‌స్పెన్సర్ అను నాస్తికుడు, "మానవ జ్ఞానమునకు అందనట్టి అయిదు స్పష్ట సంగతులున్నవి. అవేవనగా: కాలము (Time), శక్తి (Force), క్రియ(Action), రోదసి లేక మహాకాశము(Space), పదార్థము (Matter) "అని లోకమునకు ప్రకటించెను. అది గొప్ప శాస్త్రీయ సిద్ధాంతము వలె పొగడబడెను. అయితే మనము బైబిలును తెరచిన యెడల, అందలి మొదటి వచనమే ఈ అయిదు శాస్త్రీయ సూత్రములతో నిండి యున్నది. ఆదికాండము 1:1 ఇట్లు చెప్పుచున్నది: "ఆది యందు దేవుడు భూమ్యాకాశము

లను సృజించెను". ఆది యందు అనగా కాలము, దేవుడు అనగా శక్తి భూమిని అనగా పదార్ధమును, ఆకాశమును అనగా రోదసీని, సృజించెను అనగా క్రియను ఆ మొదటి వచనమే తెలియ జేయుచున్నది. దేవుని వాక్య లేఖకుడగు మోషే ఈ అయిదు స్పష్టసంగతులను ఎరిగి యుండెనా? లేక అతడు దేవునిచే నడిపింపబడెనా? దీనిని ఏమని చెప్పుదుము?

మోషే కాలమందున్న ప్రజలకు భూగోళ శాస్త్రమును గూర్చిగాని, సాగర గర్భ శాస్త్రమును గూర్చి గాని (Geography & Oceanography) ఏమియును తెలియదు. మోషే కాలమునాటి యూదులకు తెలిసిన దంతయును బహుశ మధ్యధరా సముద్రము మాత్రమే అయియుండవచ్చును (యెహో 1:4). అయితే ఆనాటి అజ్ఞానమును లక్ష్య పెట్టకనే సృష్టి జరిగిన మూడవ దినమును గూర్చి మోషే యిట్లు చెప్పెను: "దేవుడు ఆకాశము క్రిందనున్న జలము లొకచోటనే కూర్చబడి ఆరిన నేల కనబడుగాక యని పలుకగా ఆ ప్రకార మాయెను. జలరాశికి ఆయన సముద్రములు అని పేరు పెట్టెను" (ఆది 1:9,10). జలములన్నిటిని ఒక చోటనే దేవుడు కూర్చినట్లు మోషే చెప్పెను. మన మొక భూగోళమును పరిశీలించిన యెడల మోషే చెప్పిన సంగతి యధార్థ మని యిట్టే గ్రహించగలము. మహా సముద్రములన్నియును ఒకదాని కొకటి కలసి యుండుటచే వాటన్నిటికి ఒకే ఒక్క అడుగుభాగము (Sea bed) ఉన్నట్లగు పడును. మోషే నాటి ప్రజలకు తెలిసినది ఒకే ఒక్క సముద్రమే అయినను, ఆ జలరాసికి ఆయన సముద్రములు అని పేరు పెట్టెనని చెప్పినప్పుడు మోషే బహువచనమునే ప్రయోగించెను. అయితే ఈసంగతిని మోషే ఎట్లు యెరుగును? మానవ జ్ఞానముచే అతడు కనుగొనెనా? లేక దేవుడే అతనికి అది బయలుపరచెనా?

ఖగోళశాస్త్రమునందు నేడు మానవులు ఎక్కువ పురోగమించి యున్నారు. దూరదర్శిని సహాయము వలన అది సాధ్యమాయెను. గాని ఆకాశమునందలి నక్షత్రములు లెక్కింపన గునని ఒకప్పుడు మానవులు తలంచిరి. మన పూర్వీకులు ఆకాశము నందున్న

నక్షత్రముల సంఖ్య బహు స్వల్పమని భావించిరి. క్రీ॥పూ॥ 150వ సం॥లో హిప్పార్కస్ (Hipparchus) అను నతడు ఆకాశము లో 1000 నక్షత్రము లున్నవని ప్రకటించెను. క్రీ॥శ 150వ సం॥లో టోలెమి (Ptolemy) అను నతడు 1025 నక్షత్రములో మాత్రమే ఆకాశమందున్నవని చెప్పెను. అయితే దూరదర్శిని కనుగొనబడిన తరువాత ఆ నక్షత్రముల సంఖ్య లెక్కింపనలవి కాదని మానవులు ఇప్పుడు గ్రహించి యున్నారు. అయితే క్రీస్తుకు పూర్వము 1500 సం॥లు క్రితవే ఆకాశ నక్షత్రములు లెక్కింప తరము గాదని మోషే బైబిలు నందు వ్రాసెను. దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానమును గూర్చి మోషే యిట్లు వ్రాసెను: "మరియు నీ సంతానమును భూమి మీద నుండు రేణువులవలె విస్తరింప జేసెదను, ఎట్లనగా ఒకడు భూమి మీద నుండు రేణువులను లెక్కింపగలిగిన యెడల నీ సంతానమును కూడ లెక్కింపవచ్చును". "మరియు ఆయన వెలుపలికి అతని (అబ్రహామును) తీసికొనివచ్చి - నీవు ఆకాశమువైపు తేరి చూచి నక్షత్రములను లెక్కించుటకు నీచేతనైతే లెక్కించుమని చెప్పి, నీ సంతానము ఆలాగవునని చెప్పెను" (ఆది 13:16; 15:5). యిర్మియా 33:22లో మరల బైబిలు గ్రంధము యిట్లు చెప్పుచున్నది; "ఆకాశ నక్షత్రములు లెక్కింపశక్యము కానట్టుగాను నా సేవకుడైన దావీదు సంతానమును, నాకు పరిచర్యచేయు లేవీయులను లెక్కింపలేనంతగా నేను విస్తరింప జేయుదును". ఆకాశ నక్షత్రములు లెక్కింప నశక్యమని ఈ పురాతన లేఖకులెట్లెరుగుదురు? దానికి ఒకే ఒక్క జవాబున్నది - దేవుడు ఆ సంగతిని వారికి బయలుపరచి తన గ్రంథమందు మనకొరకు లిఖింప జేసెను.

దేవుడు చంద్రుని ఆకాశములో ఒక నమ్మమైన సాక్షిగా యేర్పరచెనని క్రీర్తన 19:36లో వ్రాయబడి యున్నది. సాక్షియొక్క పని యేమిటి? అతడు చూచిన దానిని గూర్చి చూడలేనివారికి సాక్ష్యమిచ్చుటయే గదా? నిజానికి ఆకాశములో చంద్రుడు అదేపనిని చేయుచున్నాడు. పశ్చిమ క్షితిజములో సూర్యుడస్తమించగానే అది మనకు

కనపడకుండపోవును. చంద్రుడయితే ఆకాశములో యుండి సూర్యుని చూచుచూ రాత్రివేళ సూర్యకిరణములను చంద్రకాంతి వలె మనకు ప్రతిబింబించు చున్నాడు. సూర్యుని గూర్చి చంద్రుడు సాక్ష్యమిచ్చు చున్నాడు. అయితే దావీదు మహారాజు కాలములో సూర్యుని వెలగునే చంద్రుడు భూమిపైకి ప్రతిబింబించుచున్నాడని ప్రజలెవరును యెరుగరు. అయినను సరే దావీదు దాని విషయమై వ్రాసెను. దావీదు తన స్వజ్ఞానముచే దానిని కనుగొనెనా ? లేక సూర్య చంద్ర నక్షత్రములను సృజించిన దేవుడు దావీదు కలమును విజ్ఞాన శాస్త్రయుక్తముగా నడిపించెనా? దీనిని యేమందుము?

అబ్రహాము కాలమునకు సమీపము గా గోత్రకర్తయగు యోబు నివసించెను. అట్టి గొప్ప గోత్రకర్త ఈ పుడమి యందున్న కాలములో మానవ దిఙ్మండలముపై విజ్ఞానశాస్త్ర ప్రభావము ఇసుమంతయు ఉదయింపనేలేదు. అతని కాలములో భూవ్యోత్పత్తిని గూర్చి హాస్యజనక సిద్ధాంతము లెన్నియో ప్రబలి యుండెను. అయితే యోబు తన కలమును చేబూని ఆనాటి మానవ మూఢత్వమును లక్ష్యపెట్టక నేటి శాస్త్రజ్ఞులు ఒకదాని తరువాత మరొకటి కనుగొనుచున్న అనేక వైజ్ఞానిక సత్యములను ఆనాడే బైబిలునందు లిఖించెను. అతడు చెప్పిన వైజ్ఞానికి సంగతుల ననేకములను వచ్చే సంచికలో పరిశీలించుదము గాని ఇప్పుడు అయితే యోబు 26:7లో వ్రాయబడిన గొప్ప వైజ్ఞానిక సంగతిని గూర్చి మాత్రము చెప్పుకొనుటకు మనకు సమయమున్నది.

యోబు 26:7లో "శూన్య మండలముపైని ఉత్తర దిక్కునున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను" అని భక్తుడైన యోబు వ్రాసెను. ఖగోళ శాస్త్రజ్ఞులు దూరదర్శిగని సహాయము వలన ఎక్కువ పురోగమించియున్నారని ఇంతకు ముందే ఒకసారి చెప్పు కొన్నాము. వారు చేయుచున్న ఖగోళ పరిశోధనలో ఈ మధ్యనే ఒక గొప్ప ఆశ్చర్యకరమైన సంగతిని కనుగొనిరి. అదేమన: అతి మిక్కిలి శక్తివంతమైన ఖగోళ దూరదర్శినిని వారు తూర్పు, పశ్చిమ, దక్షిణ దిశలకు మళ్ళించి

చూచినప్పుడు ఖగోళశాస్త్రజ్ఞులు అనేక క్రొత్త గ్రహములను, నక్షత్రములను చూడగల్గిరి. కాని వారు ఆ దూరదర్శినిని ఉత్తర దిక్కునకు మళ్ళించినప్పుడు వట్టి శూన్యమును మాత్రము వారు కనుగొనిరి. 'దేవుడు ఉత్తర దిక్కుననున్న ఆకాశ విశాలమును పరచెను' అనుగొప్ప వైజ్ఞానిక సత్యమును క్రీ.పూ 2000 సం॥లకు ముందే భక్తుడైన యోబు బైబిలునందు వ్రాయగా దానిని మన శాస్త్రజ్ఞులు ఇటీవలనే కనుగొనిరి. అయితే మానవ జ్ఞానమున కందనట్టి ఈ గొప్ప సంగతిని యోబుకు బయలుపరచిన వాడెవడు? నిజముగా దేవుడేగదా?

బైబిలు కేవలము కట్టుకథల పుస్తకమే యని బైబిలు శత్రువులు, అజ్ఞానులు ఎంత ప్రచారము చేసినను అది నిత్య సత్య దేవుని యొక్క వాక్యమై యున్నది. వచ్చే పాఠములో బైబిలు నందిమిడి యున్న మరికొన్ని గొప్ప వైజ్ఞానిక సంగతులను గూర్చి తెలిసి కొందము. ఈలోగా బైబిలు గ్రంధమును మీరు చదివి ధ్యానించండి, మీ బంధు మిత్రులు ఆ గ్రంధమును చదివేలాగున వారిని ప్రోత్సహించండి. లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించండి. అవే యేసుక్రీస్తుని గూర్చి సాక్ష్యమిచ్చు చున్నవని యోహా 5:39 చెప్పుచున్నది. నిత్యజీవమును పొందవలె నంటే క్రీస్తునందు విశ్వసించి, ఆయన మాటలకు లోబడుట అత్యవసరమని గ్రహించుడి.

– జాషువా గూటం

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు

50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O.BOX-80,KAKINADA - 533 001.

# నీవేమి ధరించుకొన్నావు?

## (What Have You Put on ?)

ప్రజలు తమ అంతస్థుకు తగినట్లుగా దుస్తులు ధరిస్తారు. మన వస్త్రధారణను బట్టి మన అంతస్థు తెలియనగును. కొన్ని సందర్భాల్లో ఆయా వ్యక్తులు ధరించే దుస్తులు వారు చేసే పనిని తెలియ జేస్తాయి. ఉదా: పోలీసులు, నర్సులు, స్కూలు పిల్లలు. మరికొందరు ధరించే దుస్తులు వారి జాతిని తెలియజేస్తాయి. సంపన్నులు ఉదారంగు వస్త్రములను ధరించుట కద్దు (లూకా 16:19).

దేవుడు మొదట స్త్రీ పురుషులను చేసినప్పుడు వారు దిగంబరులు. దేవుడు నిషేధించిన ఫలాన్ని తినినప్పుడు "వారిద్దరి కన్నులు తెరవబడెను; వారు తాము దిగంబరులమని తెలిసికొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములు చేసికొనిరి" (ఆది.కా. 3:7). దేవుడు స్త్రీ పురుషులను సర్పమును శపించెను. మరియు "దేవుడైన యెహోవా ఆదామునకును అతని భార్యకును చర్మము చొక్కాలను చేయించి వారికి తొడిగెను" (ఆది.కా. 3:21).

మన మొదటి తల్లిదండ్రులకు దేవుడే వస్త్రములను చేయించెను. యాకోబు తన భార్య యగు రాహేలు యెడల ప్రత్యేక ప్రేమను కనబరుస్తు యోసేపుకు రంగురంగుల అంగీని చేయించి యిచ్చెను. దేవుడు అహరోనును ప్రధాన యాజకునిగా నియమించినప్పుడు అతడు ధరించవలసిన ప్రత్యేక దుస్తులను గూర్చిన హెచ్చరికలను నిర్గమ 28:2-14లో యిచ్చెను. సహోదరులు ఐక్యత కలిగి నివసించునప్పుడు అది తలమీదపోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారిన పరిమళ తైలము వలె యుండునని దావీదు చెప్పెను (దా.కీర్తన 133:2). "బాలుడైన సమూయేలు నారతో నేయబడిన ఏఫోదు ధరించుకొని యెహోవాకు పరిచర్యచేయుచుండెను". వాని తల్లి వానికి చిన్న అంగీ ఒకటి కుట్టి యేటేట బలి అర్పించుటకు తన పెనిమిటితో కూడ వచ్చినప్పుడు దాని తెచ్చి వాని కిచ్చుచువచ్చెను" (I సమూ 2:18-19). ఏలియా తన దుప్పటిని ఎలీషా మీద వేసి అతని ప్రవక్తగా నియమించెను. ఏలియా ఆకాశమున కారోహణమయినప్పుడు అతని దుప్పటి

క్రింద పడగా ఎలీషా దానిని తీసికొనగా అతడు ప్రవక్తగా ఏలియా కంటే రెట్టింపు శక్తిని పొందెను (2 రాజులు 2:8-13). రాజులు, రాజవస్త్రములు ధరించేవారు. దుఃఖసమయాల్లో పూర్వము ప్రజలు తమ వస్త్రములను చింపుకొనేవారు.

ఆకాను శపితమైన హాయి వారి సొమ్ములో ఒక మంచి షీనారు వస్త్రమును రెండు వందల తులముల వెండిన, ఏబది తులముల బంగారు కడ్డీని ఆశించి దొంగిలించెను. దురాశ వలన అతడు, అతని కుటుంబీకులు చంపబడిరి (యెహోషువ 7:1-26). ఎలీషా యొక్క సేవకుడగు గెహాజీ నయమాను దగ్గర రెండు జతల బట్టలను వెండిని ఆశించినందున కుష్టరోగముతో శపించబడెను (2రాజులు 5:22-27).

క్రొత్త నిబంధనలో యేసు ప్రభువు జన్మించగానే ఆయన పొత్తిగుడ్డలతో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్ట బడెను (లూకా 2:7). బాప్తిస్మమిచ్చు యెహోను ఒంటె రోమముల వస్త్రమును మొల చుట్టుతోలు దట్టియు ధరించు కొనేవాడు (మత్త 3:4). గుడ్డివాడైన బర్తిమయిని యేసు పిలిచినప్పుడు వాడు బట్టను పారవేసి దిగ్గన లేచి యేసునొద్దకు వచ్చెను (మార్కు 16:5; లూకా 24:4; యెహోను 20:12). యేసు సిలువ వేయబడగా సైనికులు ఆయన వస్త్రము కొరకు చీటీ వేసుకొనిరి. యేసు పరమున కారోహణుడవుచుండగా తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు, ఆయన ఏ రీతిగా వెళ్లెనో అదే రీతిగా తిరిగి వచ్చునని చెప్పిరి (అపో. కా. 1:10-11). ప్రకటన 1:13లో పాదముల మట్టునకు దిగుచున్న వస్త్రము ధరించుకొనిన యేసు యోహానుకు దర్శనమిచ్చెను.

ఈ సందర్భములన్నిటిలోను ఆయా ప్రజలు ధరించుకొనిన వస్త్రములను ప్రాముఖ్యంగా మనం గమనించగలము. "యేమితిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చి యైనను చింతింపకుడి; ఆహారము కంటే ప్రాణమును వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా?" యని యేసు చెప్పెను (మత్తయి 6:25). లూకా 16లో యున్న ధనవంతుడు ఊదా రంగు వస్త్రముల కొరకు చింతించాడు గాని ఆత్మీయ వస్త్రములను గూర్చి ఎన్నడు ఆలోచించ లేదు.

క్రీస్తును ధరించు కొన్న వారు క్రైస్తవులు. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించు కొని యున్నారు"(గలతీ 3:27). పౌలు ఇంకా ఇట్లు చెప్పాడు: "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించు వాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించు చున్న జీవితము నన్ను ప్రేమించి నాకొరకు తన్నుతాను అప్పగించు కొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20).

యెరూషలేము దేవాలయము దగ్గర పేతురు యోహానులు ఒక కుంటి వానిని స్వస్థపరచినప్పుడు గొప్ప గందరగోళము జరిగెను. పేతురు యోహానులు అక్కడ గుమిగూడిన జన సమూహామునకు బహు ధైర్యముగా వాక్యము బోధించిరి. "వారు పేతురు యోహానుల ధైర్యమును చూచినప్పుడు వారు విద్యలేని పామరులని గ్రహించి ఆశ్చర్యపడి వారు యేసుతోకూడ ఉండిన వారని గుర్తెరిగిరి" (అపొ.కా. 4:13). పేతురు యోహానులు తమ జీవితము ద్వారా నిజంగా దేవుని మహిమ పరచిరి. "మనము అంధకార క్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించు కొందము... పగటియందు నడుచు కొన్నట్టు మర్యాదగా నడుచుకొందము. మెట్టుకు ప్రభువైన యేసు క్రీస్తును ధరించుకొనిన వారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీర విషయమై ఆలోచన చేసికొనకుడి" (రోమా 13:12-14) యని పౌలు హెచ్చరించాడు.

క్రీస్తును ధరించుకొన్నపుడు నూతన సృష్టి అగుదుము. "మీ చిత్త వృత్తి యందు నూతన పరచబడిన వారై నీతియు యదార్థమైన భక్తియు గలవారై దేవుని పోలికెగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:23-24). మనము దేవుని సర్వాంగ కవచమును ధరించు కొనునప్పుడు అపవాది యొక్క తంత్రములను ఎదిరించుటకు శక్తి గలవారమగుదుము (ఎఫెసీ 6:11-17). ఏలయనగా మన ప్రాచీన స్వభావము దాని క్రియలతో కూడ విసర్జింపబడగా జ్ఞానము కలుగు నిమిత్తము మనలను సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న

నవీన స్వభావమును ధరించు కొందుము(కొలస్స 3:10). క్రీస్తును ధరించుకొన్నవారు "జాలిగల మనస్సును, దయాళుత్వమును వినయమును సాత్వికమును దీర్ఘ శాంతమును ధరించుకొందురు" (కొలస్స 3:12). వీటన్నిటికి పైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకొందురు (కొలస్స 3:14).

క్రైస్తవ స్త్రీలు అణుకువయు స్వస్థబుద్ధియు గల వారై యుండి సత్ క్రియల చేత తమ్మును తాము అలంక రించుకొనవలెనని పౌలు ఉపదేశించెను (1తిమో 3:9-10;1పేతురు 4:8). క్రైస్తవులు దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని తమ్ము తాము అలంక రించుకొనవలెనని పేతురు హెచ్చ రించాడు (1 పేతురు 5:5). క్రీస్తును ధరించుకొన్నవారు వినయము విధేయత, దీనమనస్సులను ధరించు కొంటారు. ఈ లక్షణాల ద్వారా వారు దేవుని మహిమపరుస్తారు.

పెండ్లి విందునకు పిలువబడినవాడు తగిన వస్త్రము ధరించుకొని యుండ నందున యజమానుడు వానిని బయట చీకటిలోనికి వడవేయించిన ఉపమానమును యేసు బోధించారు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 22:11-14). లవొదికయలో యున్న సంఘమునకు ప్రభువు ఇట్ల చెప్పారు: "నీ దిసమొల సిగ్గు కనబడకుండునట్లు ధరించు కొనుటకు తెల్లని వస్త్రములను నీకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు కాటుకను నా యొద్ద కొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను" (ప్రక 3:18).

"జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవ గ్రంథములో నుండి అతని పేరెంత మాత్రమును తుడుపుపెట్టక, నాతండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందు నని" ప్రభువు చెప్పెను (ప్రక 3:5-6). ఈ పుడమి పై ఆయన నామమును ధరించిన వానికి ప్రభువు యిచ్చిన వాగ్దానమిది. క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొను దినము కొరకు మనము ఆశతో ఎదురు చూచుచుందుము గాక! (1కొరింధీ 15:53).

**-కవిత గూటం**

# ప్రేమ లేని సంఘము - ఎఫెసు

(The Loveless Church)

(ప్రకటన 2:1-7)

## పరిచయము :

1. రోమా సామ్రాజ్యములో నాలుగవ పెద్ద పట్టణము ఎఫెసు.

2. దాని జనాభా 3 లక్షల నుండి 6 లక్షల వరకు యుండెది. అది మధ్య ఆసియాకు ముఖ్య కేంద్రము.

మూడు ప్రముఖ వ్యాపార మార్గములు ఎఫెసు గుండా వెళ్లేయి.

3. పూర్వకాలములో ప్రపంచము లోని 7 గొప్ప సంగతులలో ఒకటి ఎఫెసులో యుండేది.

అది అర్తెమిదేవి యొక్క గుడి. అది 425 అడుగుల పొడవు 225 అడుగుల వెడల్పు వుండేది. 127 స్థంభాలు దానికి కలవు. ఒక్కొక్క స్థంభము ఒక్కొక్క రాజుచే బహుకరించ బడెను. దాని ఎత్తు 60 అడుగులు. దాని మెట్లు కుప్ర నుండి తేబడిన ఒకే ఒక్క మ్రాను నుండి తొలచబడెను. ఆ గుడి పవిత్రంగా ఎంచబడేది. ప్రశస్త సామగ్రి దానిలో నిల్వ యుంచేవారు. తద్వారా అది ప్రపంచపు మొదటి బ్యాంకు ఆయెను. నేరస్థులు దానికి 200 గజముల మేరకు రాగలిగితే వారికి క్షేమమే. ఆ గుడి చుట్టూ తాయెత్తులు అమ్మేవారు.

4. ఎఫెసు వారు అస్థిరులు, అవినీతి పరులు, మూఢనమ్మకస్థులు, దుర్మార్గులు.

5. యేసు తల్లి యైన మరియ అక్కడ వుండెను. తిమోతి, అకుల, ప్రిస్కిల్ల, అపొ. యోహాను మొదలగు వారు అక్కడ కాపురముండేవారు. అపొ. పౌలు కూడ మూడు సంవత్సరములు అక్కడ కాపురముండి సువార్త చాటెను.

6. పౌలు చేసిన రెండవ సువార్త యాత్రలో అతడు ఎఫెసులో క్రీస్తు సంఘమును స్థాపించెను (54-57 A.D.లో) అతడు చేసిన మూడవ సువార్త యాత్రలో క్రీ॥శ 58లో అక్కడికి మరల చేరుకొనెను. క్రీ॥శ 63లో అతడింకొక మారు అక్కడికి వెళ్లెను.

7. గనుక యోహాను కలము ద్వారా యేసు ఎఫెసులో యున్న సంఘానికి వర్తమానము వ్రాయుసరికి అది ఇంచుమించు 40 సంవత్సరముల వయస్సు గల సంఘము.

**I.ఎఫెసులో నున్న సంఘమునకు పత్రిక వ్రాయించిన వాడు (1వచ).**

A. క్రీస్తు ఏడు నక్షత్రములను కుడి చేత బట్టుకొని ఏడు దీపస్థంభముల మధ్య సంచరించుచున్నట్లు వర్ణించబడెను. ప్రక 1:20 ని బట్టి ఆ నక్షత్రములు సంఘములకు దూతలు. ఏడు దీపస్థంభములు ఏడు సంఘములు క్రీస్తు వాటిని తన చేత బట్టుకొని, తన ఆధీనములో యుంచుకొన్నారు. సంఘముల మధ్య క్రీస్తు సంచరించు చున్నారు (మత్త 18:20).

**II.ఎఫెసులో ఉన్న సంఘపు దూత: (1వచ)**

A. ఈ దూత ఎవరు?

B. దూత అనగా వార్తావాహుడు, దేవదూత కానక్కరలేదు.

C. ఎఫెసులో యున్న సంఘ పెద్దలే ఈ దూతయని నాయభిప్రాయం. అప్పటికి సంఘములన్నియు వాక్య ప్రకారమైన పాలన పద్ధతి కలిగి యుండెను(I తిమో 3:1-13). ఎఫెసులో యున్న సంఘము పెద్దలను కలిగి యుండెను. (అపో.కా.20:17-28). గనుక ఈ వర్తమానము వారికి అందించబడి యుండెననుట విదితమే.

**III. సంఘము నకు అభినందన (2,3,6 వచ).**

A. నీక్రియలను కష్టమును నేనెరుగుదును అని క్రీస్తు అన్నప్పుడు పరిపూర్ణ దైవ జ్ఞానం సూచింపబడు చున్నది. ఎఫెసులో యున్న క్రైస్తవులను గూర్చి అంతా ఆయనకు తెలుసు. ఆయన కన్నులకు మరుగు లేక సమస్తమును తేటగాయున్నది. (హెబ్రీ 4:13 సామెతలు 15:3).

B. క్రీస్తు వారి క్రియలను గూర్చి ఎరుగును. వారి జీవన విధానము ఆయన ఎరుగును.

మత్తయి 7:2; లూకా 6:46; ఫిలిప్పీ 2:12; యాకోబు 1:22 2:17,26.

C. ప్రతి సంఘములో పని చేసేవారు, పనిచేయనివారు, విమర్శించే వారుంటారు.

D. నీ క్రియలను 'నీ కష్టమును' నేనెరుగుదును అని యేసు అన్నారు. సొమ్మసిల్లేంత వరకు వారు శ్రమించే వారు. దీనిని ఆయన ఎరుగును.

E. ఆ సంఘము యొక్క సహనమును కూడ క్రీస్తు అభినందించారు. సహనము అంటే ఓరిమితో కూడిన పట్టుదల, ఏకాగ్రత.

1. వారు ఆయననామము నిమిత్తము భారము భరించి అలయలేదని

ఆయన గుర్తించారు (3వ). ఆయన అధికారమును గూర్చి, మహిమను గూర్చి వారు తమ విశ్వాసములో నిలకడగా యుండిరి. వీటిని యితరులకు బోధించేవారు, శ్రమలలోకూడ ఒప్పుకొనేవారు (అపొ.కా. 5:41).

2. వారు అలయలేదు, సొమ్మ సిల్లలేదు.

గలతీ 6:9; హెబ్రీ 12:1-4; I థెస్స 5:14.

F. వారు దుష్టులను సహింపలేనందున యేసు వారిని అభినందించారు (2వ).

దుష్కార్యము చేయుటకు సమూహమును వెంబడింప కూడదు (నిర్గమ 23:2). దేవుని ప్రజలలో దుష్కార్యము కనబడితే ఎఫెసు సంఘము దాన్ని గూర్చి తగురీతిగ చర్య తీసికొనేవారు. అది మేము చూడలేదు, మా పని కాదు అనుకొనే వారు కాదు. పునరుద్ధరింపబడ వీలుకాని వారిని సహవాసము నుండి తొలగించే వారు (2 థెస్స 3:6, గలతీ 6:1).

క్రైస్తవులు ఈ లోకంలో యున్నను, వారు లోకస్థులు కారు (యోహాను 17:15).

G. దొంగ అపోస్తలులను పరీక్షించినందున ప్రభువు వారిని అభినందించారు (2వ).

అపొస్తలుని యొక్క అర్హతలను వారెరు గుదురు.

అపొస్తలుడు యేసు యొక్క పరిచర్య ఆరంభము నుండి ఆయనతో యుండి ఆయన పునరుత్థానమునకు సాక్షియైనవాడై యుండాలి (అపొ.కా. 1:21-22). ఎఫెసు సంఘస్థులు ప్రతి బోధను నమ్మక పరీక్షించేవారు. అబద్ధ బోధకులు న్నారని వారికి తెలుసు. అందుకే పరీక్షించేవారు (I యోహాను 4:1). సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుకొనేవారు (I థెస్స5:21). బెరయలోని ఘనుల వలె లేఖనములలో ఆలాగున్నవో లేదో యని పరీక్షించేవారు (అపొ.కా. 17:11).

I .నికొలాయితుల క్రియలను వారు ద్వేషించు చున్నందున క్రీస్తు వారిని అభినందించారు.

నికొలాయితులు జారత్వమును, విగ్రహారాధనను ప్రోత్సహించు

చుండిరి. అనగా జనాంగముల నుండి క్రీస్తులోనికి వచ్చిన వారికి యెరుషలేములో యున్న అపొస్తలులు, "వారు విగ్రహములకు అర్పించిన వాటిని, రక్తమును, గొంతు పిసికి చంపిన దానిని జారత్వమును విసర్జింపవలెనని" తెలియజేసిరి (అపొ. కా. 15:28-29) ప్రక 2:14-15 చూడుము.

IV.ఎఫెసు సంఘము పై నిందారోపణ(4వ)

A. దేవదూషణను గూర్చి, నైతిక దుష్ప్రవర్తనను గూర్చి క్రీస్తు వారిని నిందించలేదు.

B. అక్కడ క్రైస్తవుల ప్రేమ లేని తత్వం ఖండించబడెను. వారు తమ మొదటి ప్రేమను కోల్పోయారు. "అక్రమము విస్తరించుట చేత అనేకుల ప్రేమ చల్లారునని"యేసు చెప్పారు (మత్తయి 24:12).
ఎఫెసు సంఘము యొక్క మొదటి ప్రేమ యేమిటి? క్రీస్తే వారి మొదటి ప్రేమ!
ఆయనను మనం పూర్ణాత్మతోను, మనస్సుతోను, శక్తితోను ప్రేమింపవలెను (మార్కు 12:39-30). ఎవడైనను ప్రభువును ప్రేమింపకుంటే వాడు శపించబడును (I కొరింధీ 16:22).

C. మనమాయనను ప్రేమిస్తే, దాన్ని క్రియలలో చూపించాలి. "మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (I యోహాను 5:3). "మీరు నన్ను మించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15;21,23). ఎఫెసీయులు ఆయన ఆజ్ఞలను గైకొనుటలో ఉదాసీను లయ్యారు.

D. వారిని వెనుకకు లాగిన దేమిటి?

1. బహుశ దేమా వలె వారు లోకమును ప్రేమింప మొదలు పెట్టారు (2 తిమో 4:10). దేవుడు దీనిని ఖండించారు (1 యోహాను 2:15-17). మత్తయి 6:24

2.రహస్య పాపముల వలన బహుశ వారు క్రీస్తును నిర్లక్ష్యం చేసారు.

3.ప్రేమలేని గృహం గృహమే కాదు. క్రీస్తు యెడల ప్రేమ లేని సంఘము క్రీస్తు సంఘమే కాదు. ఎఫెసులో జరిగింది యిదే.

V.ప్రేమ లేని తత్వానికి విరుగుడు: (5వ)

A. "జ్ఞాపకము చేసికొనుము" అని క్రీస్తు

చెప్పారు. వారు మొదట క్రైస్తవులై నప్పుడు ఎంత ఉత్సాహవంతులో కొందరు మరచిపోయారు.

వారు ఏ స్థితిలో నుండి పడిపోయారో జ్ఞాపకము చేసికొనుచుయుండాలి. ఒకొనొకప్పుడు ఆత్మీయంగా శిఖరాన్ని అధిరోహించారు. ఇప్పుడు పాపపు బురదలో పడిపోయారు. క్రైస్తవులు కృపలో నుండి తొలగి పోగలరు (గలతీ 5:4;హెబ్రీ 3:12).

3. "మొదటి క్రియలను చేయుము"

వారు మొదట క్రైస్తవులైనప్పుడున్న ఉత్సాహాన్ని మరల పుంజుకోవాలి. క్రీస్తు కొరకు చురుకుగా యుండిరి. మనం క్రియల వలన మాత్రమే రక్షింపబడము, గాని అవి ప్రాముఖ్యం. మృతులు తమ క్రియలను బట్టి తీర్పుపొందుదురు. (ప్రక 20:11-12;2 కొరింధీ 5:10; ప్రక 20:12).

**C. మారు మనస్సు పొందాలి**

నీ మనస్సును మార్చుకోవాలి. అది దేవుని అనుగ్రహము వలన కలిగే దైవచిత్తానుసారమైన దుఃఖము (రోమా 2:4;2 కొరింధీ 7:10). దేవుని ఉగ్రతను గూర్చిన భయం కూడ మారుమనస్సుకు దోహదం చేస్తాది (2 కొరింధీ 5:11,14; I యోహాను 4:19). నీవు మారు మనస్సు పొందితేనే సరి! లేదా? యని యేసు ఎఫెసీయులను హెచ్చరించారు.

**D. మారుమనస్సు పొందకపోతే ?**

యేసు దాని దీపస్థంభమును దాని చోటు నుండి తీసివేతునని చెప్పారు. మారు మనస్సు పొందకపోతే ప్రేమ లేకపోతే సంఘము అక్కడ మనుగడ కలిగి యుండుట అసాధ్యము.

E. ఆసియాలోని ఏడింటిలోని 5 సంఘాలు మారుమనస్సు పొందాలని క్రీస్తు హెచ్చరించుట విచారకరము. సంఘము దీపస్తంభముగా చెప్పబడుట గుర్తించుము. పాపము, అజ్ఞానము, మూఢత్వము, విగ్రహారాధనతో నిండియున్న అంధకారలోకంలో సంఘము వెలుగైయుండుట అవసరం (మత్తయి 5:14-10). క్రైస్తవులుగా లోకంలో మనం జ్యోతుల వలె ప్రకాశించు చున్నామా? (ఫిలిప్పీ 2:15).

F. మారు మనస్సు పొందితేనే సరి... లేదా? యనే హెచ్చరిక

రెండవమారు క్రీస్తు యిచ్చిన దానిని గమనించుము. ఆయన ఇంత వరకు యిచ్చిన గడువు చాలు! దేవుని దీర్ఘశాంతమునకొక గడువున్నదని మనం గుర్తెరగాలి (ఆది.కా.6:3; రోమా 1:24,26,28).

**VI. వాగ్ధానము : ( 7వ)**

A. సంఘమును పురికొల్పుటకు గాను క్రీస్తు ఒక వాగ్ధానము యిచ్చెను. వారికొక బహుమతి ప్రకటించెను. దేవుడు ప్రతిఫలమిచ్చువాడు (హెబ్రీ 11:6).

B. 'జయించువానికి' అంటే జయించుచు యుండువానికి. ఒకసారి జయం పొందితే సరిపోదు. విశ్వాససహితమైన మంచి పోరాటము ను ప్రతి దినం పోరాడాలి. రోజూ జయిస్తూ యుండాలి. సువార్త కవచమును మనం ధరిస్తే అది సాధ్యమే (ఎఫెసీ 6:10-18,I యోహాను 5:4).

C. 'జీవ వృక్షము' -దీన్ని మనం ఆది కాండము 3:22లో మొదట కనుగొంటాము. దాని ఫలమును తినినవారు నిత్యము జీవిస్తారు. జీవజలనదికి ఇరుప్రైవులా జీవవృక్షము ప్రకటన 22:2లో మనకు కనబడతాది. ఆ వృక్షము యొక్క ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగింపబడును.

D. 'పరదైసులో యున్న జీవవృక్షము'. ఆదిలో ఆ పరదైసు ఏదెను అయ్యుండెను. ఇప్పుడది పరలోకం (2కొరి 12:4).

**ముగింపు:-** ప్రేమ లేని ఆత్మసంబంధమైన క్రియల విషయమై మారు మనస్సు అవసరం. ఈ సహోదరులు సిద్ధాంత పరంగా ఖచ్చితమే గాని ఆత్మీయంగా వట్టివారే. మనం క్రీస్తును మొదట ప్రేమించాలి (2 కొరింధీ 8:55; 2 కొరింధీ 5:14; ఎఫెసీ 4:15), ఎఫెసులో దీపస్థంభము తీసివేయబడెను. ఇప్పుడక్కడ 'ఇస్లామ్' మతమున్నది. మనమెట్లున్నాము? దేవుని కుమారుని పరీక్షలో ఎఫెసు వారి కంటె మంచిగా యుంటామా?

– జాన్ స్టేసీ

# మంచి కాపరి

(The Good Shepherd)

మంచి కాపరిని తెలిసికొనక మునుపు మనకు బాల శిక్షకునిగాను దృష్టాంతముగాను యున్నటువంటి పాత నిబంధనను ఒకసారి తెరచి చూద్దాం- ప్రవక్తయిన యెహేజ్కేలు గ్రంథము 34:1-19 వరకు చదివిన యెడల ఇశ్రాయేలీయుల కాపరులను గూర్చి తెలిసికోగలం. వారిని గూర్చి దేవుడు యివ్వథముగా సెలవిచ్చియున్నాడు.

**ఇశ్రాయేలీయుల కాపరులు:-**

1. కడుపు నింపుకొనువారు
2. గొఱ్ఱెలను మేపరు
3. బలహీనమైన వాటిని బలపరచరు
4. రోగము గల వాటిని స్వస్థపరచరు
5. గాయపడినవాటికి కట్టుకట్టరు
6. తోలివేసినవాటిని మరలా తోలుకొనిరారు
7. తప్పిపోయిన వాటిని వెదకరు
8. కఠిన మనస్కులై బలత్కారముగా వాటిని ఏలుదురు.

కనుక కాపరులు లేకయే అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను.

కాపరి అనగా కాపాడువాడు, గాయము కట్టువాడు అన్నిటికి మించి శత్రుభయము నుండి వాటిని రక్షించువాడు. ఈ లక్షణాలు ఇశ్రాయేలీయుల కాపరులకు లేవు గనుక గొఱ్ఱెలు (ఇశ్రాయేలీయులు) చెదరిపోయాయి. అడవి మృగములకు అనగా అన్యరాజులకు చెరపట్టబడ్డారు. చెదరిపోయిన గొఱ్ఱెలను గూర్చి దేవుని ప్రేమ, జాలి ఏమైయుందో ఒక్కసారి చూడండి. 11 వచనం నుండి 15 వచనం వరకు చదవండి. దేవుడు తన బాధనువ్యక్తపరస్తూ - ఇదిగో నేను నేనే నాగొఱ్ఱెలను వెదకి వాటిని కనుగొందును--- నేను మంచి మేతగల చోట వాటిని మేపెదను, ఇశ్రాయేలు యొక్క ఉన్నత స్థలముల మీద వాటికి దొడ్డి యేర్పడును అక్కడ అవి మంచి దొడ్డిలో పండుకొనును (యెహేజ్కేలు 34:11;14).

**దేవుడు:-**

1.తప్పిపోయిన దానిని వెదకుదును

2.తోలివేసిన దానిని తోలుకొని వచ్చెదను

3.మంచి మేతగల చోట వాటిని మేపెదను

4.గాయపడినదానికి కట్టు కట్టుదును

5.దుర్బలముగా ఉన్నదానిని బలపరుచుదును

అయితే క్రొవ్విన వాటికిని, బలముగల వాటికిని శిక్షయను మేత పెట్టి లయ పరచెదను అని చెప్పెను (యెహెజ్కేలు 34:16).

**గమనించవలసిన విషయములు:-** చెదరిపోయిన గొఱ్ఱెలను (అన్యులను, ఇశ్రాయేలీయులను) రక్షించి ఏకము చేయు నిమిత్తం తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తుని ఈలోకమునకు పంపి ఉన్నతస్థలముల మీద అనగా పర్వతములపై (యెషయా 2:2, మీకా 4:1 జకర్యా 1:16) దొడ్డి అనగా సంఘం స్థాపించి ఒకే దొడ్డి (సంఘము)ను, ఒకే ద్వారము (మార్గం)ను ఒకే మంచి కాపరి (క్రీస్తు, శిరస్సు) ని మనకు అనుగ్రహించారు.

**యేసు క్రీస్తు మంచి కాపరి:-** నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని, మంచి కాపరి గొఱ్ఱెల నేనే ద్వారమును నాద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై లోపలికి పోవుచు బయటికి వచ్చుచూ మేత మేయును నుండును (యోహాను 10:9).

**A.మంచి కాపరి లక్షణములు:-**

1.ద్వారము గుండా ప్రవేశించును-(దేవుని సంకల్పము చొప్పున చేయును)

2.తన గొఱ్ఱెలను పేరు పెట్టి పిలచును (యెషయా 43:1). ప్రతి వనిని ఎరుగును (యోహాను 1:12) వారి ప్రతి పనిని ఎరుగును వారితో ఎల్లప్పుడు జీవించును (మత్తయి 6:19,34).

3.గొఱ్ఱెలకు ముందుగా నడుచును.(క్రీస్తు శిష్యులకు ముందుగా నడచి నిష్కపటమైన జీవితమును జీవించెను. ఆలాగుననే మనము కూడ తన అడుగు జాడలయందు నడుచుకొనవలెనని మనకు మాదిరి యుంచిపోయెను. (1పేతురు 2:21-25).

4.గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును - (ఉదా. తప్పిపోయిన గొఱ్ఱెకొరకు కాపరి వెదకుటను గూర్చి క్రీస్తు చెప్పిన ఉపమానం) తప్పిపోయిన గొఱ్ఱెలు

..నగా నశించిన దానిని వెదకి రక్షించుటకు క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. లూకా 19:10; 1తిమోతి 1:15, 1 పేతురు 1:19. పాపముతో చనిపోయిన వారికి ఆయన జీవము అనుగ్రహించెను హెబ్రీ 2:9; రోమా 5:8,9; ఎఫెసీ 2:1.

**B.గొఱ్ఱెలకు ఉండవలసిన మంచి లక్షణాలు:-**

1.గొఱ్ఱెలు కాపరి స్వరము వినును (క్రీస్తు మన కాపరి కనుక మనం ఆయన స్వరమును వినవలెను అనగా ఆయన చిత్తమును గ్రహించి దానికి విధేయత చూపవలెను. (రోమా 12:2;రోమా 10:17).

2.కాపరిని వెంబడించును:-క్రీస్తు మంచి కాపరి కనుక శిష్యులు క్రీస్తుని వెంబడించారు అలాగే మనమును

a) చీకటిలో నడువక జీవపు వెలుగులో నడువవలయును పాపమును విడచి నీతిని అనుసరింపవలయును. (1 యోహాను1:6,7).

b) శరీర కార్యములు విసర్జింపవలయును ఆత్మఫలములు ఫలింపవలెను(గలతీ 5:19-22)

c) దుర్గుణములు విడచి సద్గుణములు కల్గియుండవలెను సహోదర ప్రేమ, దయ, క్రీస్తుని గూర్చిన జ్ఞానము, భక్తి కల్గి యుండవలెను 1 పేతురు 1:5-11; తీతు 2:12,15; యాకోబు 1:27 చదువుము.

**ముగింపు**: ప్రధాన కాపరి, గొఱ్ఱెల గొప్ప కాపరి, మంచికాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కీరిటము పొందుదురు. 1 పేతురు 5:4, హెబ్రీ 13:20 యోహాను 10:11. ఆ ప్రత్యక్షతను కనిపెట్టుకొనుచూ మన స్వంత రక్షణను కొనసాగించుకొందము. ప్రియచదువరీ నీవు రక్షించబడలేదా? అయితే క్రీస్తు నందు విశ్వసించి నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది క్రీస్తే దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది నీ పాపములు కడిగివేసికొని క్రీస్తు సంఘసభ్యుడవు కావలెనని నా ప్రార్ధన.

**జె.కె. ఏలియా, వరంగల్లు**

# రెవరెండ్ ఎందుక్కాదు?
## (Why not Reverend?)

క్రీస్తు సంఘ బోధకులు రెవరెండ్ అను బిరుదుతో ఎందకు పిలవ బడరోయని అనేకులు ఆశ్చర్యపడ్డారు. దానికి జవాబు బైబిలులోనే యున్నది.

మొదటిగా, భూమి మీద ఎవనికైనా, ఏ మనుష్యునికైనా ఈ పదము వర్తింప జేయబడినట్లు బైబిలులో ఎక్కడా లేదు. బోధకుడు, సువార్తికుడు, సేవకుడు, దాసుడు అను పదములు దేవుని వ్యాక్యాన్ని ప్రకటించువాని కుపయోగింపబడ్డాయి. గాని రెవరెండ్ అను పదము ఇంగ్లీషు బైబిలులో దేవునికి మాత్రమే ఉపమోగింపబడింది. కీర్తన 111:9 లో ఇట్లున్నది : "ఆయన తన ప్రజలకు విమోచనము కలుగజేయు వాడు. తన నిబంధన ఆయన నిత్యముగా ఉండ నిర్ణయించువాడు. ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది. ("Holy and Reverend is His name"). ఈ పదము బైబిలులో ఒకే ఒక్కసారి వినియోగింపబడినందునను, అది దేవుని నామము కొరకే వాడబడినందునను, ఆ పదము మహాపరిశుద్ధుడైన దేవునికే వాడబడవలెనని క్రీస్తు సంఘము విశ్వసించును. ఇదేమంత పెద్ద సమస్య కాదని చులకనగా వాడేయడం వలన బైబిలును గాక మానవ కల్పిత పద్ధతుల ననుసరించు మతశాఖల పద్ధతులు ఏలాగు వ్యాపించియునాయో గమనించుకోవచ్చును.

మతసంబంధముగా ఈ పదాన్ని ఒక బిరుదుగా వాడుట వలన బోధకులను ఒక ప్రత్యేక తరగతిగా పరిగణించు చున్నట్లగుపడుచున్నది. 'రెవరెండ్లను' సామాన్య సభ్యుల నుండి అది వేరు చేయుచున్నది. యిదికూడ దైవసంకల్పం కాదుగాని మానవ కల్పితవేం. సువార్తకులోబడి దాన్ని బోధించుటకు ఉపయోగించు వారిని మిగతా క్రైస్తవులతో వేరుచేసే పద్ధతి యేదీ క్రొత్త నిబంధనలో కానరాదు (2థెస్స2:14). ఇంకోమాటలో క్రైస్తవుడైనవాడు అతడు బోధకుడైనా, సామాన్య సంఘసభ్యుడైనా, మిగతావారికంటే పైగాయున్నావాడు కాదు. అందువలన దేవుని వాక్యాన్ని అనుసరించు క్రీస్తు సంఘస్థులు దేవునికి చెందిన ఘనతను తమకు అపాదించుకొనరు. రెడరెండ్లని పిలువబడరు.

–డెన్నిస్ స్మిత్

## సంక్షిప్త వార్తలు

2006 ఆగస్టు 7వ తేదీ సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆలమూరులో జరిగిన సువార్త కూటములో సోదరులు రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆలమూరులోను భట్లమాగుటూరులోను సోదరులు కందవల్లి జాన్ గారు క్రీస్తు కొరకు మంచి పనిచేయుచున్నారు.

ఆగస్టు 11వ తేదీ శుక్రవారం రిక్కీ గారు సతీసమేతముగా సోదరులు బి.సుదర్శనరావుగారి ఆధ్వర్యమున కృష్ణాజిల్లా పెడనలో యున్న సంఘమును దర్శించిరి. పెడనలో సోదరులు బి.వి.రామారావుగారు సోదరులు సుదర్శనరావు గారి నడిపింపు చొప్పున క్రీస్తు సువార్త చాటుచున్నారు. తదుపరి వారు పెడనలో చాల కాలముగా సువార్త పనిచేసిన సోదరులు కె.జోసఫ్ గారిని వారు పనిచేయుచున్న స్థానిక సంఘమును దర్శించిరి. జోసఫ్ గారి కుమారుడు చంద్రమోహన్ గుడ్లవల్లేరులో ప్రభువు కొరకు పనిచేయుచున్నారు.

ఆగస్టు 21వ తేదీ సోమవారం రిక్కీగారు, సత్యవాణి క్రీస్తుసంఘ యువకులు అమలాపురం, ముమ్మిడివరం మండలాల్లో వరదకు గురియైన సంఘములను, ప్రాంతములను దర్శించిరి.

ఆగస్టు 25వ తేదీ శుక్రవారం అనపర్తి మండలం పొలమూరు గ్రామములో నిర్మించబోయే క్రీస్తు సంఘ ఆలయమునకు సోదరులు జాషువా గూటం గారు శంకుస్థాపన చేసిరి. పొలమూరులో సోదరులు కె.జయానందము గారు సువార్తికునిగా పనిచేయుచు అక్కడనున్న సంఘమును సమర్థవంతముగా నడుపుచున్నారు.

ఆగస్టు 26వ తేదీ శనివారం రిక్కీ గారు అమలాపురం మండలంలో వరదకు గురియైన వాడపర్రు, బడుగువారిపేట, ఉప్పలగుప్తం లలో యున్న

క్రీస్తు సంఘస్తులకు ఓయ్యం, చీరలు, దుప్పట్లు వగయిరా ఉచితముగా సరఫరా చేసిరి.

ఆగస్టు 29 మంగళవారం ముమ్మిడివరం మండలం కొండుకుదురు. కె.జగన్నాధపురం, శానపులంక, తొత్తరమూడి గ్రామాలలో రిక్కీ గారు పర్యటించి వరద బాధితులకు పైనుదహరించిన రీతిగా సహాయము నందించిరి. ఈ గ్రామములు గోదావరి గట్టుకు గండిపడిన ప్రాంతములలో యుండుట వలన అక్కడ అపారమైన నష్టము సంభవించినది.

ఆగస్టు 30వ తేదీ బుధవారం రిక్కీ గారు అమలాపురం మండలం గున్నేపల్లి, దేవగుప్తం, సామంతకుర్రు, పెద ఆంధ్రపేట మొదలగు గ్రామములలో యున్న వారికి వరద సహాయము నందించిరి. ఆయా ప్రాంతములలో వరద నష్టము అపారముగా యున్నందున అక్కడి వారికి తగు సహాయము లభించునట్లు ప్రార్థించమనవి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004